క్లుప్తంగా

శిథిలమైన ఇంట్లో ఉండొద్దు



లక్ష్మిని బయటకు రావాలని కోరుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

ఏటూరునాగారం: శిథిలమైన ఇంట్లో ఉండొద్దని ఎంపీడీఓ శ్రీనివాస్ ప్రజలను కోరారు. సోమవారం స్థానిక 8వ వార్డులో శిథిలమైన ఇంటి వద్దకు చేరుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తుండడంతో మట్టిగోడల ఇళ్లు కుంగిపోయి ఉండడంతో తోకల లక్ష్మి ఇంటికి వెళ్లి ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉందని, బయటకు వచ్చి ఉండాలని సూచించారు. అయితే మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని, మాకు ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని ఆమె తెలుపడంతో అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమాదేవి, బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి, సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బెస్తగూడం గ్రామానికి చెందిన గజ్జల బాబురావు(46) ఇంటి వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తమ్ముడు గజ్జల సదలబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట పరిధిలోని మారెడుగొండ చెరువు మత్తడి పడడంతో బూర్గుపేటకు వెళ్లే రహదారి కోతకు గురైంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై చల్ల రాజు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బూర్గుపేటకు చెందిన ట్రాక్టర్ యాజమానుల సహాయంతో కోతకు గురైన రోడ్డుపై గ్రావెల్ పోసి మరమ్మతు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఎస్సై స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించడంతో స్థానిక గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్‌కు సన్మానం

ఏటూరునాగారం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా 13 ఏళ్లుగా సేవలందిస్తున్న కోట శ్రీనివాస్‌ను ఉత్తమ సేవలందించిన ఉద్యోగిగా గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకొని ములుగులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నాడు. ఈ మేరకు సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఈట రేణుక, అధ్యాపక, అధ్యాపకేతర బృందం కలిసి బెస్ట్ ఎంప్లాయి అవార్డు పొందినందుకు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మించారు. కార్యక్రమంలో వెంకటయ్య, జ్యోతి, కనీఫ్ ఫాతిమా, రమేష్, జీవవేణి, శేఖర్, భాస్కర్, శ్రీకాంత్, భాస్కర్, విజయలక్ష్మి, లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ విద్యాబోధన అంగన్‌వాడీల్లో నిర్వహించాలి



ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీ కార్మికులు

ములుగు రూరల్ : ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫెస్ క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పీఎం శ్రీ విద్యాబోధన బాధ్యతలు అప్పగించాలని అన్నారు. సద్దాం హుస్సేన్, నాయకులు సరోజిని, భాగ్యలక్ష్మి, నిర్మల, పార్వతి పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఎడతెరిపిలేని వాన

- జలదిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు
- ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- వాహనాల రాకపోకలకు అంతరాయం



వెంకటాపురం(కె) : ఉధృతంగా ప్రవహిస్తున్న కంకల వాగు

వెంకటాపురం(కె) : మండలంలో రెండు రోజులుగా కుర్తుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వాగుల్లోకి చేరి ప్రమాద స్థాయి మించి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కంకలవాగు, రాచపల్లి వాగు, పాలెం వాగు ఆలుబాక సమీపంలోని జిన్నెల వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తుండటంతో గిరిజన గ్రామాలైన కర్రవానిగుంపు, మల్లాపురం, రాచపల్లి, మొట్లగూడెం, లక్ష్మీపురం, కలిపాక, తిప్పాపురం, పెంకవాగు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కంకల వాగు, పాలెంవాగు వరద నీటికి పంట పొలాలు నీటమునిగి పోయాయి. భారీ వర్షాకు మిర్చి నారు మళ్లలో నీరు నిలిచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీటితో బీసీ హాస్టల్ చుట్టు వర్షం నీరు చేరింది. పెట్రోల్ బంక్, బెస్తగూడెం వెళ్లే రహదారిపై వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వీఆర్‌కే పురంలో వర్షం నీరు ఇళ్లలోకి చేరింది.

వరద ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

మండంలోని వరద ముంపు ప్రాంతాలను సోమవారం మండల అధికారులు పరిశీలించారు. మండలంలోని బల్లకట్టు వాగు, కుక్కతోగు వాగు, కంకల వాగుల వద్ద భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ వాగుల వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కన్నాయిగూడెం : మండలంలో రాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని వాగులు, ఒర్రెలు వరదనీటితో పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన ఐలాపుర్, కంతనపల్లి, సర్వాయి గ్రామాలకు చుట్టుపక్కల ఉన్న వాగులు, వంకలు వరదనీటితో ప్రహిస్తుండడంతో పూర్తిగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐలాపుర్‌కు అడ్డుగా ఉన్న దయ్యాలవాగు, కొర్రి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో గ్రా మంలోని ప్రజలు ఎటు బయటకు రాకుండా గ్రా మంలో బంది అయ్యారు. మరో గ్రామం కంతనపల్లి దీనికి అడ్డుగా ఉన్న పెద్దచెరువు నుంచి వచ్చే వరద నీరు రోడ్డు పై ప్రవహించడంతో రాకపోకలు కొంత మేర నిలిచిపోయాయి.హనుమంతుని వాగు ఏడు వాగుల కలయికతో ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న గౌరారం వాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగలగుట్ట వాగు..

మండలంలోని కంతనపల్లి పరిధిలోని ప్రధాన రహదారికి అడ్డుగా ఉన్న దొంగలగుట్ట లోలెవల్ రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండలం నుంచి వివిధ పనులపై ఏటూరునాగారం వరంగల్, భద్రాచలం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయణినికులకు రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. కంతనపల్లి పరిధిలో ఉన్న రెండు లోలెవెల్ వంతెనలకు బదులుగా హైలెవెల్ వంతనలు నిర్మిస్తే ప్రయాణం సులభతరం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

నీట మునిగిన పంటపొలాలు

మండలంలో రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో లక్ష్మీపురం, బుట్టాయిగూడెం, చింతగూడెం, ముప్పనపల్లి గ్రామాల్లో పంటపొలాలు నీటిలో మునిగిపోయాయి. ఎగువప్రాంతం నుంచి వస్తున్న వరదలతో వరి పంటలు నీటిలో మునిగిపోయాయి.



పునరావాస బాధితులకు బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ఉధృతంగా ప్రవహిస్తున్న తూముల వాగు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని సోమవారం ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. దీంతో మండలంలోని ఊరట్టం తూముల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. తూముల వాగు వరదతో ఊరట్టం, కన్నెపల్లి గ్రామాల్లోని వరి పంటలు నీటమునిగాయి. వరి పంటలు చెరువులను తలపిస్తుడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే వరదలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే రెండు, మూడు రోజులు వర్షాలు పడితే పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



మంగపేట : గంపోనిగూడెం వద్ద నిలిచిపోయిన వాహనాలు



వెంకటాపురం(కె) : వీఆర్‌కేపురంలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు



వెంకటాపురం(కె): దుర్గమ్మగుడి సెంటర్‌లో దెబ్బతిన ఆర్‌అండ్‌బీ రోడ్డు



వెంకటాపురం(కె): వాగుల వద్ద వరదను పరిశీలిస్తున్న అధికారులు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఊరట్టంలో నీటమునిగిన వరి పొలాలు



మంగపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై నుంచి పారుతున్న వరదనీరు



ఏటూరునాగారం–భద్రాచలం మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న జీడివాగు



కన్నాయిగూడెం : దొంగలగుట్ట లోలెవెల్ వంతెన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



కన్నాయిగూడెం : ఏడువాగుల కలయికతో ఉధృతంగా ప్రవహిస్తున్న హనుమంతుని వాగు

సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి

- ములుగు సీఐ సురేశ్



ములుగు రూరల్ : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



వెంకటాపురం(ఎం) : రామాలయ చైర్మన్ భాస్కర్‌కు భగవద్గీతను బహూకరిస్తున్న హెచ్‌ఎం

ములుగు రూరల్ : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని ఆధ్యాత్మిక వేత్త సామాజికవేత్త, జిల్లా కన్వీనర్ బండారు రఘు, ములుగు సీఐ సురేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా బాల గోకులం కార్యక్రమాన్ని 800 మంది చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వంలా ప్రజలు కలిసిమెలసి ఉండాలని అన్నారు. ధర్మజాగరణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించిన గండ్రకోట కుమార్‌ను అభినందించారు. బాలగోకులంలో పాల్గొన్న ఆయా పాఠశాలల యాజమాన్యాలను సీఐ శాలువాతో సన్మానించి వ్యాసమహర్షి పటం, భగవద్గీత పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు చంద్రారెడ్డి, గౌతమ్, శ్రీకాంత్, ధనుంజయ, పాఠశాల ప్రిన్సిపాళ్ల రాజు, జాయిద్, రాజేందర్‌రెడ్డి, సతీష్, సంతోష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలు

వెంకటాపురం(ఎం) : స్థానిక రామాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు జోహార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జాహీద్ తెలిపారు. పిల్లలు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణతో అలరించారని, ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నన్నారు. రామాలయంతో పాటు గ్రంథాలయానికి భగవద్గీతను బహూకరించినట్లు వెల్లడించారు. ఆలయ చైర్మన్ నరెడ్ల భాస్కర్, డైరెక్టర్ చింతిరెడ్డి రమణారెడ్డి, ఎస్ఎస్‌యూఐ నాయకులు మామిడిశెట్టి కోటి, భూస గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



రేగొండ: కొన్ని రోజులుగా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న బైక్, కాపర్ వైరు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు పట్టుకున్నారు. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం కంటాయపాలెం గ్రామానికి చెందిన చర్లపల్లి శివ గణపురం మండలంలోని కర్కపల్లిలో నివాసం ఉంటున్నాడు. శివ అతడి బామ్మర్ది లింగబాబుతో కలిసి గత కొంతకాలంగా రేగొండ, నెల్లికుదురు, లింగాల, దమ్మన్నపేటతో పాటు పలు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్‌వైర్, బావి వద్ద మోటార్లు, బైక్‌లను దొంగిలించారు. కాగా సోమవారం భాగిర్థిపేట క్రాస్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో దొంగిలించిన బైక్‌తో నిందితుడు పట్టుపడ్డాడు. పోలీసులు నిందితుడి నుంచి రెండు బైక్‌లు, రూ.75 వేల నగదు, 5 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా బైక్‌లు, కాపర్‌వైర్, మోటార్లు చోరీ చేస్తున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న రేగొండ ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



ములుగు రూరల్ : రక్షణ కవచాలను అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో పాపన్న గౌడ్ 375 జయంతి త్సవాల్లో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఆయన జీవిత చరిత్రను, ఆయన త్యాగాలను గుర్తించుకోవాలని అన్నారు. హక్కుల కోసం పోరాడి అన్యాయాలను ఎదిరించిన ఆయన జీవితం మన అందరికీ అదర్శం అన్నారు. సమాజంలో గౌడన్నలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేటట్లు చూస్తామని అన్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు, బీసీ భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కలుగీత కార్మికులకు కాటమయ్య 100 రక్షణ కవచాలను అందించారు. కార్యక్రమం అదనపు కలెక్టర్ మహేంందర్, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఎక్సైజ్ సీఐ సుధీర్ కుమార్ తదితరులు ఉన్నారు.



కన్నాయిగూడెం : జెండా ఎగురవేస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని కల్లుగీత కార్మికులు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు పాలకుర్తి శ్రీధర్ అధ్యక్షతన పాపన్న జయంతి వేడుకలను పురస్కరించుకొని గూర్రేవుల గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రధాన రహదారిపై జెండా ఎగరవేసి స్వీట్లు పంచుకొన్నారు. కార్యక్రమానికి జిల్లా నాయకుడు మారగోని రాజు గౌడ్ హాజరై జెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న బడుగుల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడని శ్రీధర్ కొనియాడారు. కార్యక్రమంలో తాడూరి శ్రీధర్ గౌడ్, తాటి కనకసేన గౌడ్, నాగేష్ గౌడ్, కోడూరి చంటి గౌడ్, కోరుకొప్పుల దీపక్‌రాజ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కమలాపురంలో బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు

మంగపేట : మండంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. మండలంలోని కమలాపురంలో ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామంలోని ఇందిరానగర్, బగత్‌సింగ్‌నగర్‌లోని జనావాసాల్లోకి భారీగా వరదనీరు చేరడంతో ఆయన ముంపు ప్రాంతాలను మండల స్పెషలాఫీసర్ సిద్దార్థ రెడ్డి, ఎంపీడీఓ బద్రు, ఎంపీఓ శ్రీనివాస్ గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి 15 కుటుంబాలకు చెందిన 60 మంది బాధితులను కమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అదే విధంగా నర్సింహాసాగర్‌లో 8 కుటుంబాలకు చెందిన మరో 40 మందిని జెడ్పీ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. మరో రెండు రోజుల పాటు ఇదే విధంగా అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాగులు, చెరువుల నుంచి వచ్చే వరదల వలన ముంపు ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి వర్షాలు, వరదల వలన ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సమాచారం ఇవ్వాలని వారు పేర్కొన్నారు.

లోడ్ ఇలా చేస్తే.. వాహనాలు వచ్చేదెలా?

వాజేడు : అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు రాకపోకలు సాగుతుంటాయి. మండల పరిధిలోని టేకులగూడెం వద్ద ఉన్న ఇసుక క్వారీకి సంబంధించిన ఇసుకను జాతీయ రహదారి పక్కన డంప్ చేసి ఉంచారు. దానికి ఆన్‌లైన్ కావడంతో లోడింగ్ కోసం లారీలు వస్తున్నాయి. లారీలను జాతీయ రహదారిపై ఉంచి లోడ్ చేస్తుండటంతో జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే వాహనాలను ఇబ్బంది కలుగుతుంది. ఇసుకను లోడ్ చేసే సమయంలో ఒక పక్కకు లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ జాతీయ రహదారిపైనే ఉంచి లోడ్ చేస్తుండటం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వాహనాలు, కంటైనర్లు, బస్సుల్లోని ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటుంది. ఇసుకను లోడ్ చేసే సదరు క్వారీ నిర్వాహకులు రహదారిపై కాకుండా లారీలను వేరేచోట పెట్టుకుని లోడింగ్ చేయించుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై లారీ లోడ్ చేస్తుండగా పక్కన ఉన్న మరో లారీ

దాడి చేయడం సరికాదు

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన పంచిక మహేశ్‌యాదవ్‌పై అదే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు దాడి చేయడం సరికాదని తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జ్ రవి పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న ఆదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మహేశ్ కుటుంబ సభ్యులపై దాడి చేశారని తెలిపారు. గుడికి సంబంధించిన విషయంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలే తప్ప ఇలా దాడులు చేయడం సరికాదని అన్నారు.

ఫొటోగ్రఫీలో శ్రా‘వన్’

- ప్రతీ చిత్రంలో జీవం ఉండాల్సిందే..
- జాతీయ స్థాయిలో వందల సంఖ్యలో అవార్డులు, రివార్డులు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



శ్రావణ్‌కు గోల్డ్‌మెడల్ తీసుకొచ్చిన ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం ఫొటో (ఫైల్)



అంతర్జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన కొమురవెల్లి చిత్రం (ఫైల్)



శ్రావణ్

వెంకటాపురం(ఎం): వెయ్యి మాటల్లో చెప్పలేనిది ఒక చిత్రం(ఫొటో) చెబుతుందంటారు. అటువంటి ఫొటోను అందరికీ నచ్చేలా చిత్రీకరించడమే ఆ యన ప్రత్యేకత. రకరకాల హావభావాలను పలికించే చిత్రాలను తన కెమెరాలో బంధించి వందల సంఖ్యలో అవార్డులను, రివార్డులను కైవసం చేసుకున్నాడు. కొత్తగా ఈరంగలోకి అడుగుపెడుతున్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలో ని పాలంపేటకు చెందిన తడాండ్ల శ్రావణ్.

ఇంటర్‌లో మొదలైన ప్రయాణం..

2006లో ఇంటర్ చదువుతున్న సమయంలో శ్రావణ్ ఫొటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్నాడు. ములుగు ప్రాంతం అడవుల జిల్లా కావడం.. తన సొంతూరు పాలంపేట(రామప్ప) కావడంతో ఇక్కడి ప్రకృతి అందాలను చూసి ముగ్ధుడయ్యాడు. ఎలాగైనా వాటిని తన కెమెరాలో బంధించాలనుకున్నాడు. అనుకున్న వెంటనే చిన్న కెమెరా కొనుగోలు చేసి తన ఫొటోగ్రఫీ ప్రయాణాన్ని ప్రారంభించాడు.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో తనదైన శైలి..

అడవి బిడ్డ, కోయ తెగకు చెందిన శ్రావణ్ స్వతహాగా ప్రకృతి ప్రేమికుడు. తన స్వగ్రామంలోని రామప్ప చెరువు అందాలను, రామలింగేశ్వరాలయం కళాకండాలను అద్భుతంగా ఫొటో తీస్తూ మొదటి సారి అందరి మన్ననలు పొందాడు. అనంతరం కార్మిక, కర్షకుల శ్రమైక జీవన సౌందర్యాన్ని తన కెమెరాలో బంధించి తరతరాలకు చెరగని చిత్రాలను అందిస్తున్నాడు.

ప్రతీ పోటీలో పాల్గొంటూ..

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎక్కడ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించినా అందులో శ్రావణ్‌కు ఒక ఉత్తమ అవార్డు ఉంటుందంటే అతిశయోక్తి కాదు. సుమారు జాతీయ స్థాయిలో 25 గోల్డ్ మెడల్స్, 20 సిల్వర్, 16 కాంస్య, 31 మెరిట్స్ గెలుచుకున్నాడు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో 13 గోల్డ్, 8 సిల్వర్, 9 బ్రాంజ్, 21 మెరిట్ పతకాలను గెలుచుకున్నాడు. అంతర్జాతీయ పోటీల్లో ఫ్రాన్స్ నుంచి ఏఎఫ్ఐఏపీ గౌరవం, హానర్ తీసుకున్నారు. ఈనెల ఆగస్టు 2న తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ నిర్వహించిన థీం ఆఫ్ ఎమోషన్ అంశంపై ఆల్ ఇండియా ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాడు.